సాక్షి కామారెడ్డి

గురువారం । 19 । అక్టోబర్ । 2023



ఏమేమి పువ్వొప్పనే..

జిల్లాలో బతుకమ్మ సంబురాలు కొనసాగుతున్నాయి. మహిళలు ఉత్సాహంగా ఉత్సవంలో పాల్గొంటున్నారు.

- IIIలో ▸



నీటి ఎద్దడి

తాగు నీటి కోసం ఎల్లారెడ్డి పట్టణంలోని ఇందిరానగర్ కాలనీవాసులు బుధవారం ఆందోళనకు దిగారు.

- IIIలో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.8 /18.7

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశాలు ఉన్నాయి. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

'ఖైదీల విడుదలకు సిఫారసు'



కామారెడ్డి టౌన్: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ సూచనల మేరకు జిల్లా జడ్జి ఎస్ఎన్ శ్రీదేవి అధ్యక్షతన బుధవారం అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ(యూటీఆర్‌సీ) మొదటి సమావేశం నిర్వహించారు. జిల్లా కోర్టులో జరిగిన సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి, కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ సింధు శర్మ, సబ్ జైల్ సూపరింటెండెంట్ గంగా కిషన్ పాల్గొన్నారు. అర్హులైన అండర్ ట్రయల్ ఖైదీలను విడుదల చేయడానికి ఈ కమిటీ సిఫారసు చేస్తుందని జడ్జి తెలిపారు. నలుగురు ఖైదీలను విడుదల చేయాలని రాష్ట్ర లీగల్ సర్వీస్ అథారిటీకి సిఫారసు చేశామన్నారు.

కేంద్ర సచివాలయ ఉద్యోగుల పర్యటన

కామారెడ్డి రూరల్: తిమ్మక్‌పల్లి(కె)లో బుధవారం కేంద్ర ప్రభుత్వ సచివాలయ ఉద్యోగుల బృంద సభ్యులు రెండోరోజు పర్యటించారు. జిల్లాకు 40 మంది ఉద్యోగులు రాగా.. ఐదుగురు చొప్పున బృందాలుగా విడిపోయి కామారెడ్డి మండలంలోని ఎనిమిది పంచాయతీలను సందర్శించారు. రేషన్‌షాపు, పల్లె ప్రకృతివనం, కంపోస్టు షెడ్, శ్మశాన వాటిక, ప్రాథమిక పాఠశాల ఆవరణలోని విలేజ్‌మ్యాప్‌లను పరిశీలించారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు ఎలా అందుతున్నాయనే అంశంపై అధ్యయనం చేశారు.

రాహుల్ గాంధీకి స్వాగతం పలికిన షబ్బీర్ అలీ



కామారెడ్డి టౌన్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ ప్రియాంక గాంధీలకు బుధవారం హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయం వద్ద మాజీ మంత్రి షబ్బీర్ అలీ ఘన స్వాగతం పలికారు. కాంగ్రెస్ బస్సు యాత్రలో పాల్గొనడానికి వారితో పాటు షబ్బీర్ ములుగు వెళ్లారు.

ఉత్తమ ఉద్యోగులకు అవార్డులు



కామారెడ్డి టౌన్: కామారెడ్డి ఆర్టీసీ డిపోలో ఉత్తమ సేవలందించిన కండక్టర్లు, డ్రైవర్లకు డిపో మేనేజర్ ఇందిర బుధవారం అవార్డులు అందించారు. గత నెలలో ఎక్కువ ఆదాయం తీసుకువచ్చిన కండక్టర్లు, అధిక డీజిల్ పొదుపు చేసిన డ్రైవర్లను ప్రగతి చక్రం అవార్డులతోపాటు ప్రశంస పత్రాలను అందజేశామన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు వసుంధర, లింగమూర్తి పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ

కామారెడ్డి అర్బన్: ఉపాధి అవకాశాలు కల్పించేందుకు టైలరింగ్, బ్యూటీపార్లర్ కోర్సుల్లో 30 రోజుల శిక్షణ ఇవ్వనున్నారు. ఈ విషయాన్ని కామారెడ్డి పట్టణ పరిధిలోని దేవునిపల్లి విద్యుత్ నగర్‌లోగల అక్షయ శిక్షణ సంస్థ డైరెక్టర్ ఎస్.భూపాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల 14 నుంచి 21 ఏళ్లలోపు మహిళలు 99491 73338, 74167 13338 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

బీఆర్‌ఎస్‌లో అంతర్గత పోరు

ప్రగతిభవన్ వేదికగా రచ్చకెక్కింది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ ముందే కామారెడ్డికి చెందిన ఇరు వర్గాలు వాదులాడుకున్నాయి. దీంతో ఆయన వారిపై సీరియస్ అయినట్లు తెలిసింది. ఆధిపత్యం కోసం కొట్లాడకుండా కేసీఆర్‌కు భారీ మెజారిటీ తీసుకురావడానికి కృషి చేయాలని నేతలకు సూచించారని తెలిసింది. పార్టీకి నష్టం చేసేవారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించినట్లు సమాచారం.



కేటీఆర్‌కు నాగలిని బహూకరిస్తున్న మాచారెడ్డి మండల పార్టీ నేతలు

భారీ మెజారిటీ తెచ్చే బాధ్యత మీదే..

తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ వెంట నడిచిన కామారెడ్డి ప్రాంత ప్రజలు ఎన్నికల్లోనూ అదే ఉద్యమ స్ఫూర్తితో అండగా ఉంటారని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. నాయకులు బాధ్యతతో పనిచేస్తే వారంతా కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపిస్తారన్నారు. బూత్ బాధ్యతలు చూసే నాయకులంతా 75 శాతం ఓట్లు సాధించేందుకు కృషి చేయాలన్నారు. పార్టీలో ఆధిపత్యం కోసం కాకుండా తమ బూత్‌లలో మెజారిటీ కోసం పోటీ పడాలని సూచించారు. కేసీఆర్‌ను రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీతో గెలిపించాల్సిన బాధ్యత బూత్ ఇన్‌చార్జీలపై ఉందన్నారు. ముఖ్యమంత్రే కామారెడ్డి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నందున నిధులకు ఢోకా ఉండదని కేటీఆర్ స్పష్టం చేసినట్టు సమాచారం. గ్రామాల వారీగా రూపొందించే మేనిఫెస్టోను ఎన్నికలు కాగానే కచ్చితంగా అమలు చేస్తామన్న భరోసా ఇవ్వాలని, తానే ముందుండి పనులు చేయిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిసింది. పార్టీని భారీ మెజారిటీతో గెలిపించుకునేందుకు అందరూ కృషి చేయాలని మంత్రి సూచించారు.

ప్రగతిభవన్‌లో పంచాయితీ!



కామారెడ్డి పట్టణ నేతలతో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

- కేటీఆర్ ముందే వాదులాడుకున్న కామారెడ్డి నేతలు
- అందరి చిట్టా తన వద్ద ఉందన్న మంత్రి
- పార్టీకి నష్టం చేసేవారిని సస్పెండ్ చేస్తానని వార్నింగ్
- ఆధిపత్యం కోసం కాదు.. మెజారిటీ కోసం పోటీపడాలని హితవు

సాక్షి, కామారెడ్డి: సీఎం కేసీఆర్ పోటీ చేస్తున్న కామారెడ్డి నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నేతలతో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుధవారం ప్రగతిభవన్‌లో సమావేశమయ్యారు. ముందుగా నిర్ణయించిన ప్రకారం ఈ సమావేశం కామారెడ్డిలోనే నిర్వహించాల్సి ఉంది. అనివార్య కారణాలతో సమావేశాన్ని ప్రగతి భవన్‌కు మార్చారు. ముఖ్య నేతలందరూ అక్కడికే రావాలని సమాచారం ఇవ్వడంతో నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన నాయకులు బుధవారం మధ్యాహ్నం ప్రగతిభవన్‌కు చేరుకున్నారు. ఐదు గంటలకుపైగా మంత్రి కేటీఆర్ మండలాలవారీగా సమీక్షించారు. ముందుగా నియోజకవర్గ ముఖ్య నేతలతో మాట్లాడిన సందర్భంలో ఇద్దరు ప్రధాన నేతల మధ్య వాదులాట జరిగినట్లు తెలిసింది. వారిని కేటీఆర్ వారించడంతో గొడవ సద్దుమణిగింది. విభేదాలను వీడి, పార్టీ కోసం కలిసి పనిచేయాలని కేటీఆర్ హితవు పలికారని సమాచారం.

మండలాలవారీగా..

మంత్రి కేటీఆర్ మండలాలవారీగా నేతలతో సమావేశమయ్యారు. కామారెడ్డి, మాచారెడ్డి, దోమకొండ, రాజంపేట, భిక్కనూరు, రామారెడ్డి మండలాల నేతలతో ఆయా ప్రాంతాల పరిస్థితిపై చర్చించారు. నేతలు స్థానిక పరిస్థితులను మంత్రికి వివరించారు. అభివృద్ధి విషయంలో ఎలాంటి అనుమానాలు అక్కరలేదని, సీఎం నియోజకవర్గం కావడంతో అన్ని పనులు జరుగుతాయని, ఎన్నికలు కాగానే అన్నింటినీ పూర్తి చేస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. కామారెడ్డి టౌన్‌కు సంబంధించిన సమావేశంలో పలువురు నాయకులు పట్టణంలో తమకు విలువ ఇవ్వడం లేదని ఫిర్యాదు చేసినట్టు సమాచారం. ఎమ్మెల్యే అనుచరులను మిగతా నేతలు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలో భూకబ్జాల గురించి కూడా ఫిర్యాదు చేశారని సమాచారం. ఈ సందర్భంగా కేటీఆర్ తనకు అన్నీ తెలుసని, తప్పు చేసేవారిపై కచ్చితంగా చర్యలుంటాయని పేర్కొన్నట్లు తెలిసింది. పార్టీకి నష్టం చేసేవారిని క్షమించబోమని, వారిని సస్పెండ్ చేస్తామని హెచ్చరించినట్టు సమాచారం. సమావేశంలో జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జీలైన గంప గోవర్ధన్, షేరి సుభాష్‌రెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్, రాష్ట్ర నాయకులు తిర్మల్‌రెడ్డి, నిట్టు వేణుగోపాల్‌రావ్, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

అసమ్మతి షికారు

- జిల్లాకేంద్రంలో అసంతృప్త కౌన్సిలర్ల ప్రత్యేక సమావేశం
- అధిష్టానం పట్టించుకోవడం లేదని ఆవేదన
- కాంగ్రెస్‌లో చేరతారని ప్రచారం

కామారెడ్డి టౌన్: కామారెడ్డి నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీలో అసమ్మతి రగులుతోంది. ముఖ్యనేతల తీరుతో అసంతృప్తితో ఉన్న కొందరు కౌన్సిలర్లు తిరుగుబావుటా ఎగరేయడానికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. వారు పార్టీ వీడనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ వ్యవహారం అధికార పార్టీకి తలనొప్పిగా మారింది.

పార్టీలో గౌరవం దక్కడం లేదని భావిస్తున్న పలువురు కౌన్సిలర్లు.. బుధవారం కలెక్టరేట్‌కు సమీపంలో ఉన్న ఓ గెస్ట్ హౌజ్‌లో సమావేశమయ్యారు. ఇందులో 3, 7, 19, 21, 24, 25, 28, 32, 46 వార్డుల కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.టీ సమావేశంలో పార్టీలో తమ పరిస్థితిపై చర్చించినట్లు తెలిసింది. ముఖ్య నేతలు తమను కౌన్సిలర్లుగా చూడడం లేదని వారంతా ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. అనంతరం వారు ఈ సమావేశానికి సంబంధించిన వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేశారు. ''మా వార్డుల్లో మాకు తెలియకుండానే ఇద్దరు ముఖ్య నేతలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అనర్హులకు ప్రభుత్వ పథకాల లబ్ధి చేకూరుస్తున్నారు. దళిత బంధు, గృహలక్ష్మి, బీసీ కుల వృత్తులకు రూ. లక్ష ఆర్థిక సహాయం, మైనారిటీలకు రూ. లక్ష సహాయంలాంటి పథకాలను డబ్బులు తీసుకుని అనర్హులకు ఇప్పించారు. బహుళ అంతస్తుల బిల్డింగ్‌లు ఉన్నవారికీ గృహలక్ష్మి పథకం మంజూరు చేశారు. దీనికి సంబంధించిన ఆధారాలు మా వద్ద ఉన్నాయి. మరోవైపు మా వార్డులలో అభివృద్ధి పనులకు నిధులు అడిగితే ఇవ్వకుండా వివక్ష చూపుతున్నారు'' అంటూ కౌన్సిలర్లు వీడియోలలో పేర్కొన్నారు. ''ప్రభుత్వ విప్‌తోపాటు పార్టీ అధిష్టానం కూడా మమ్మల్ని పట్టించుకోవడం లేదు. ఇటీవల కామారెడ్డిలో మంత్రి కేటీఆర్ నిర్వహించిన కార్యకర్తల సభలో మమ్మల్ని సామాన్య కార్యకర్తలతో కూర్చోమన్నారు. బుధవారం ప్రగతి భవన్‌లో జరిగిన సమావేశానికి మాకు ఆహ్వానమే లేదు'' అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వీడియోలతో బీఆర్‌ఎస్‌లో కలకలం నెలకొంది. వీరంతా కాంగ్రెస్‌లో చేరనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ వ్యవహారం అధికార పార్టీకి తలనొప్పిగా మారింది. దీంతో వివాదాన్ని పలువురు నేతలు మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకు వెళ్లినట్లు తెలిసింది. అసంతృప్త నేతలపై పార్టీ అధిష్టానం గుర్రుగా ఉన్నట్లు సమాచారం.

బెల్ట్ షాపుల మూసివేత

- ఎన్నికల నేపథ్యంలో ఆబ్కారీ శాఖ చర్యలు
- ఆగమవుతున్న మందుబాబులు
- స్వాగతిస్తున్న మహిళలు

రామారెడ్డి: మద్యం అమ్మకాలను పెంచాలన్న లక్ష్యంతో బెల్టుషాపుల నిర్వహణను ప్రోత్సహించిన ఆబ్కారీ అధికారులు.. ఎలక్షన్ కోడ్ అమలుతో రూటు మార్చారు. మద్యం బెల్టు దుకాణాలను ఎక్సైజ్ అధికారులు మూయించారు. మండలానికి ఒకటి రెండు మద్యం దుకాణాలు ఉండగా.. ఊరికి ఒకటి కన్నా ఎక్కువ బెల్టు షాప్‌లున్నాయి. చిన్నచిన్న పల్లెల్లోనూ మద్యం అందుబాటులో ఉంటోంది. వీటిలో అర్ధరాత్రి వరకు మద్యం అమ్మకాలు సాగుతున్నాయి. అమ్మకాలు పెంచాలన్న టార్గెట్‌లు ఉండడంతో ఎక్సైజ్ అధికారులు వీటిని చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. మద్యం అమ్మకాల లక్ష్యాన్ని చేరుకోవడానికి ఆబ్కారీ అధికారులే బెల్టు షాపులను ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలూ ఉన్నాయి.

ఎన్నికల నియమావళి అమలులోకి రావడంతో మద్యం, డబ్బుల ఎరచూపి ఓటర్లను ప్రలోభ పెడతారని భావించిన ఎన్నికల కమిషన్ సీరియస్‌గానే స్పందించింది. మద్యం, డబ్బుల ప్రభావం లేకుండానే ఎన్నికలను సజావుగా సాగించడానికి ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేశారు. అన్ని శాఖల ఉద్యోగులు ఈ తనిఖీ బృందాల్లో సభ్యులుగా ఉన్నారు. బెల్టుషాపుల ద్వారా మద్యం పంపిణీ విచ్చలవిడిగా సాగుతుందని గుర్తించి వీటిని మూసివేయించాలని ఆదేశాలిచ్చారు. బెల్టుషాపులను ఎవరైనా నిర్వహిస్తే మద్యం బాటిళ్లను సీజ్ చేయడంతోపాటు క్రిమినల్ కేసులను నమోదు చేస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు. బెల్టు షాప్‌లను మూసివేయిస్తున్నారు. ఎక్కడైనా అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు తెలిస్తే దాడి చేసి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసులు పెడుతున్నారు. దీంతో బెల్టు షాపుల నిర్వాహకులు భయపడి మద్యం విక్రయించడం లేదు. బెల్టు దుకాణాలను మూసివేయించడం వరకు బాగానే ఉన్నా.. గ్రామాలలో మందు దొరక్కపోవడంతో మందుబాబులు మాత్రం ఆగమవుతున్నారు. మహిళలు మాత్రం హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎప్పటికీ మూసివేయాలని కోరుతున్నారు.



గిద్దలో మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు

ప్రకృతిని ఆరాధించే పండుగ బతుకమ్మ

- అర్హులందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి
- స్వీప్ కార్యక్రమాలలో కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: పూలను పూజించి, ప్రకృతిని ఆరాధించే పండుగ బతుకమ్మ అని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. స్వీప్ కార్యక్రమాల్లో భాగంగా బుధవారం ఏఎంసీ ఆవరణలో బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మహిళలకు స్వీప్ బతుకమ్మను అందించారు. త్వరలో జరగబోయే ఎన్నికలలో ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ఓటు వేసేలా చూడాలన్నారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి శ్రీధర్‌రెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

ముగ్గులపోటీ..

కామారెడ్డి క్రైం: ప్రతి ఒక్కరూ తప్పకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ పాటిల్ సూచించారు. ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించేందుకు బుధవారం కామారెడ్డి ఏఎంసీ ఆవరణలో స్వీప్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితాలో తమ పేరు ఏ పోలింగ్ స్టేషన్ పరిధిలో, ఏ సీరియల్ నంబర్‌లో ఉందో ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. ఎలాంటి ప్రలోభాలకు ప్రభావితం లోనుకావొద్దన్నారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునే విధంగా జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తోందన్నారు. ముగ్గుల పోటీలలో పాల్గొన్న వారికి గిఫ్ట్ బాక్సులను అందజేశారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఏఎంసీ ఆవరణలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

కౌంటింగ్ హాళ్లలో ఏర్పాట్లు చేయండి

కామారెడ్డి క్రైం: కౌంటింగ్ హాళ్లలో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులకు సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయం సమీపంలోని కౌంటింగ్ కేంద్రాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాలకు సంబంధించి ఓట్ల లెక్కింపు ఇక్కడే జరుగుతుందన్నారు. బాన్సువాడకు సంబంధించి నిజామాబాద్‌లో ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు. కౌంటింగ్ హాళ్లలో అవసరమైన టేబుళ్లు, మార్కింగ్, బారికేడ్లు, జాలీలు, మీడియా కేంద్రం పనులు పూర్తి చేయాలన్నారు.

ఆయుధాలను డిపాజిట్ చేయాలి

లైసెన్స్‌డ్ ఆయుధాలను వెంటనే డిపాజిట్ చేసుకోవాలని కలెక్టర్ పోలీసులకు సూచించారు. ఎస్పీ చాంబర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చెక్‌పోస్టుల వద్ద గట్టి నిఘా ఉంచాలన్నారు. జిల్లాలో గుర్తించిన 125 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రవాణా సౌకర్యాలు, రహదారుల వెంట కల్వర్టులు, బ్రిడ్జీలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్పీ సింధు శర్మ, అదనపు కలెక్టర్ చంద్రమోహన్, అదనపు ఎస్పీ నరసింహారెడ్డి, ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారులు, మైనారిటీ సంక్షేమశాఖ అధికారి దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

'స్థానికేతరులకు టికెట్ ఇస్తే సహించం'



మాట్లాడుతున్న కాసుల బాలరాజు

బాన్సువాడ రూరల్: బాన్సువాడ కాంగ్రెస్ టికెట్‌ను స్థానికేతరులకు కేటాయిస్తే సహించేది లేదని, మద్దతు ఇవ్వబోమని టీపీసీసీ కార్యవర్గ సభ్యుడు, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాసుల బాలరాజు పేర్కొన్నారు. ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీల నిజామాబాద్ జిల్లా పర్యటన నేపథ్యంలో బుధవారం బాన్సువాడలోని పీఆర్ గార్డెన్‌లో నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీని నమ్ముకుని పనిచేస్తున్న స్థానికుల్లో ఎవరికి టికెట్ కేటాయించినా కష్టపడి గెలిపించుకుంటామన్నారు. స్థానికేతరులకు టికెట్ ఇస్తారనే ప్రచారంతో కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. నియోజకవర్గంలో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు చేస్తున్న అవినీతి, అరాచకాలపై పోరాడుతుంటే తాను అమ్ముడుపోయానంటూ ఆరోపణలు చేయడం బాధాకరమన్నారు. అప్పు చేసి ఇల్లు కట్టుకుంటే ఓర్వలేక బురదజల్లే ప్రచారం చేస్తున్నారని వాపోయారు. రాహుల్ గాంధీ పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. టీపీసీసీ డెలిగేట్ వెంకటరామిరెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షులు గంగాధర్ దేశాయ్, నాయకులు అబ్దుల్ ఖాలేఖ్, చంద్రశేఖర్, అసద్‌బిన్ మోసీన్, రూప్‌సింగ్, షేక్ అజీం, ఉద్దర హన్మాండ్లు, గుడాల నగేష్, శేఖర్‌రెడ్డి పుప్పాల శంకర్, గణేష్, లక్ష్మణ్, శ్రీనివాస్, షాహిద్, అరుణ్, సురేష్‌బాబ, బోయిని శంకర్ పాల్గొన్నారు.

'అవినీతి రహిత పాలన అందిస్తాం'



బీజేపీలో చేరిన చిన్నమల్లారెడ్డి గ్రామస్తులతో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి

కామారెడ్డి టౌన్: అవినీతి రహిత పాలన అందించడమే బీజేపీ లక్ష్యమని పార్టీ కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం చిన్నమల్లారెడ్డికి చెందిన పలువురు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామారెడ్డి ప్రజలు తమ ఆత్మగౌరవాన్ని ప్రగతి భవన్‌కు తాకట్టు పెట్టవద్దన్నారు. కబ్జాకోరులు, అవినీతి పరుల నుంచి కామారెడ్డిని కాపాడుకోవాలంటే బీజేపీకి ఓటు వేయాలని కోరారు. అన్ని గ్రామాల ప్రజలు బీజేపీకి మద్దతుగా నిలుస్తున్నారని, కామారెడ్డిలో సీఎం కేసీఆర్ ఓడిపోవడం ఖాయమని పేర్కొన్నారు. మూడు దశాబ్దాలుగా ఏ పార్టీ అధికారంలో ఉన్నా ప్రజల ఇబ్బందుల గురించి పట్టించుకోలేదన్నారు. తనను గెలిపిస్తే ప్రజల్లోనే ఉంటానని, వారి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

డమ్మీ తుపాకీతో వేధింపులు

- భార్యాభర్తలపై దాడికి యత్నించిన పోకిరీలు
- పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు



ఖలీల్‌వాడి(నిజామాబాద్ అర్బన్): బైక్‌పై వెళ్తున్న భార్యాభర్తలకు ముగ్గురు పోకిరీలు డమ్మీ తుపాకీ చూపించి వెకిలి చేష్టలకు పాల్పడిన ఘటన బుధవారం నిజామాబాద్‌లో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. నిజామాబాద్ నాలుగో టౌన్ పరిధిలోని ఖలీల్‌వాడిలో బుధవారం మధ్యాహ్నం భార్యాభర్తలు బైక్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో ముగ్గురు వ్యక్తులు వెనక నుంచి బైక్‌పై వచ్చి, ముందు బైక్‌పై కూర్చున్న మహిళ తలకు డమ్మీ తుపాకీ గురిపెట్టి, వెకిలి చేష్టలకు పాల్పడ్డారు. ఈ విషయాన్ని ఆమె తన భర్తకు చెప్పడంతో ఆయన బైక్‌ను పక్కన ఆపి ఎందుకు వేధిస్తున్నారని ప్రశ్నించాడు. దీంతో వారు అతడిపై దాడికి యత్నించారు. స్థానికులు దీనిని గమనించి, పోకిరీలను పట్టుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఒకటో టౌన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని నిందితులను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నిందితులను నిజామాబాద్ నగరంలోని మాలపల్లికి చెందిన కరీం, సుమీర్‌తో పాటు అహ్మదీబజార్‌కు చెందిన అజ్జాన్‌గా గుర్తించామని ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. బాధితులు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామన్నారు.



పోలీసుల అదుపులో ఉన్న నిందితులు

క్లుప్తంగా

12డీ ఫారంపై అవగాహన కల్పించాలి



డిచ్‌పల్లి: ఎన్నికల సంఘం నూతనంగా ప్రవేశ పెట్టిన 12డీ ఫారంపై ఓటర్లకు బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు అవగాహన కల్పించాలని ఆర్డీవో, రూరల్ అసెంబ్లీ రిటర్నింగ్ ఆఫీసర్ రాజేంద్రకుమార్ సూచించారు. మండలంలోని నడిపల్లి రైతు వేదికలో నియోజకవర్గ బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లతో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 80 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, 40 శాతం వైకల్యం కలిగి ఉన్న వారు 12డీ ఫారం ద్వారా దరఖాస్తు చేసుకుంటే పోలింగ్ రోజు వారికి ప్రభుత్వం వాహన సదుపాయం కల్పిస్తుందన్నారు. అలాగే పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తులు ఎలా పూర్తిచేయాలనే అంశాలను వివరించారు. పలు అంశాలపై చర్చించారు.సమావేశంలో తహసీల్దార్లు రాజేందర్, అనిరుధ్, కుత్బుద్దీన్, ఎస్‌ఏ కలీం, డిప్యూటీ తహసీల్దార్లు శ్రీకాంత్, అశ్విని, మునీరుద్దీన్, ఆర్‌ఐలు, బీఎల్‌వో సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మోపాల్: డిచ్‌పల్లి మండలంలోని ధర్మారం (బి)లో ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే సంక్షేమ జూనియర్ కళాశాలలో గణితం బోధించేందుకు అతిథి అధ్యాపకుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా రీజినల్ కో–ఆర్డినేటర్ సత్యనాథ్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు విద్యార్హత ధ్రువపత్రాలతో కళాశాలలో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు 7569860140, 8143308130 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

దాండియా ఆటలు ఆడ..

- పాటిదార్ భవన్‌లో ఉత్సాహంగా కోలాటాలు
- పాల్గొంటున్న యువత



అమ్మవారి గీతాలు ఆలపిస్తున్న మార్వాడీలు



పాటిదార్ భవన్‌లో దాండియా ఆడుతున్న మార్వాడీ మహిళలు

నిజామాబాద్ సిటీ: జిల్లాలో దసరా అంటే దాండియా నృత్యం గుర్తొస్తుంది. ఉత్తర భారతంలో బాగా ప్రాచుర్యం పొందిన ఈ నృత్యం.. గుజరాతీ, రాజస్థానీలు ఎక్కువగా ఉండే ఇందూరులో సందడి చేస్తోంది. నవరాత్రుల సందర్భంగా జిల్లా కేంద్రంలో దాండియా జోరు బాగా కనిపిస్తోంది. స్థానికులు సైతం ఈ నృత్యం నేర్చుకొని పాదం కలుపుతున్నారు. ఉత్సవాలను పురస్కరించుకుని నగరంలోని ప్రగతినగర్ పాటిదార్ భవన్‌లో మార్వాడీ మహిళలు, స్థానిక యువత తొమ్మిది రోజుల పాటు దాండియా ఆడడం సంప్రదాయంగా వస్తోంది. అమ్మవారికి ఎంతో ఇష్టమైన దాండియాను అమ్మవారి ఎదుట ఆడటం తమకు ఎంతో ఉత్సాహం, శక్తిని ఇస్తుందని వారు పేర్కొంటున్నారు. పెండ్లిలు చేసుకుని వేరే ప్రాంతాలకు వెళ్లిన మహిళలు, ఉద్యోగరీత్యా బయట ప్రాంతాల్లో ఉంటున్నవారు నవరాత్రుల్లో ఇక్కడికి వచ్చి మరీ దాండియా ఆడుతుండడం విశేషం. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు దాండియా పాల్గొంటూ ఉల్లాసంగా, ఉత్సహంగా గడుపుతున్నారు. ఈ సందర్భంగా దాండియాపై మహిళలు 'సాక్షి'తో తమ అభిప్రాయాలను వెల్లడించారు.

దాండియాతో శక్తి..



నవరాత్రుల్లో అమ్మవారి ఎదుట దాండియా ఆడితే ఎంతో శక్తి వస్తుంది. నేను ప్రస్తుతం బెంగళూరులో ఉంటున్నాను. ప్రతి సంవత్సరం ఉత్సవాల్లో దాండియా ఆడేందుకు ఇక్కడికి వస్తుంటా. దాండియా ఆడితే శరీరానికి మంచి వ్యాయామం అవుతుంది. మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. –డాక్టర్ షేజిన్ పటేల్

చిన్ననాటి నుంచి..



పాటిదార్ భవన్‌లో నా చిన్ననాటి నుంచి దాండియా ఆడుతున్నా. నవరాత్రుల్లో నా స్నేహితులతో కలిసి అమ్మవారి ఎదుట దాండియా ఆడటం ఎంతో సంతోషాన్ని ఇస్తుంది. ఈ నృత్యంతో మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అలంకరణలు చేస్తాం. –రష్మీ పటేల్, విద్యార్థి

దాండియాను మరిచిపోలేను..



వివాహం అనంతరం విశాఖపట్టణంలో ఉంటున్నా. ప్రతి సంవత్సరం నవరాత్రుల్లో దాండియా ఆడేందుకు ఇక్కడికి వస్తుంటా. కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి దాండియా ఆడటం మరిచిపోలేని అనుభూతిగా ఉంటుంది. అమ్మవారి అనుగ్రహం కోసం మాతకు పూజలు చేసి దాండియా ఆడుతాం. –దివ్యా పటేల్, వైజాగ్

ఉత్సాహాన్ని ఇస్తుంది..



దుర్గామాత ఎదుట దాండియా ఆడటం ఉత్సాహాన్ని ఇస్తుంది. దేవీకి ప్రత్యేక పూజలు నిర్వహించి రాత్రి 12 గంటల వరకు దాండియా ఆడతాం. కుటుంబపెద్దలు, స్నేహితులు చిన్న పిల్లలు గ్రూప్‌లుగా దాండియా ఆడతాం.ఇది వచ్చే తరాలు కూడ కొనసాగిస్తారు. –నేహ బాధాని

అమ్మవారి అనుగ్రహం కోసం..



నవరాత్రుల్లో దాండియా నృత్యం అమ్మవారి అనుగ్రహం కోసం ఆడటం ఆనవాయితీ గా వస్తోంది. ఇలా చేస్తే అమ్మ వారు మెచ్చి తాము కోరిన కోరికలు నెరవేరుస్తారనే నమ్మకం ఉంది. ఈ నవరాత్రుల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు కుంకుమార్చనలు, కల్చరల్ ప్రోగ్రామ్స్ కూడా నిర్వహిస్తాం. –జయబేన్ గోపాల్

కోరికలు నెరవేరుతాయి



నవరాత్రుల్లో తొమ్మిది రోజులపాటు అమ్మవారి ఎదుట భక్తిశ్రద్ధలతో దాండియా నృత్యం ఆడితే అమ్మవారు అనుగ్రహించి కోరిన కోరికలు నెరవేరుతాయి. నాట్యం రూపంలో అమ్మవారిని కొలుస్తాం. ఇలా చేస్తే అమ్మ చల్లని దయ తమపై ఎప్పుడూ ఉంటుందనే నమ్మకం. –పార్వతీదేవి

సోషల్ మీడియాలో రెచ్చిపోవద్దు..

- సామాజిక మాధ్యమాలపై ఎలక్షన్ కమిషన్ నిఘా

ఎల్లారెడ్డి: చేతిలో సెల్‌ఫోన్ ఉంది కదా అని సోషల్ మీడియాలో ఎమోషనల్ అయ్యి రాజకీయాలపై ఏదైనా కామెంట్ చేశారా..లేదా ఎవరైన పెట్టిన పోస్టింగ్‌లపై కటువుగా ఖండించారా ఇకపై ఊచలు లెక్క పెట్టాల్సిందే. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న ప్రస్తుత తరుణంలో సామాజిక మాధ్యమాలైన వాట్సప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, యూట్యూబ్, ట్విట్టర్లలో వచ్చే పోస్టింగ్‌లు, కామెంట్లపై ఎలక్షన్ కమిషన్ పూర్తి నిఘా పెట్టింది. ఎన్నికలయ్యేంత వరకు రాజకీయ నాయకులు, పార్టీలపై వ్యక్తిగత విమర్శలు, దూషణలు, పుకార్లు సృష్టించి వాటిని సోషల్ మీడియాలో వైరల్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు ఎన్నికల కమిషన్ అధికార యంత్రాగాలకు ఖచ్చితమైన ఆదేశాలు జారీ చేసింది. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే, శాంతి భద్రతలకు విఘాతం కల్పించే కామెంట్లు చేసే వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని పోలీసు అధికారులు స్పష్టం చేస్తున్నారు. అంతేకాకుండా ఈ మధ్య పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న యూట్యూబ్ మీడియా చానళ్లపై ఈసీ కొరడా ఝుళిపించనుంది.

మీడియా ముసుగులో చేతిలో ఒక లోగో మైకులు పట్టుకుని, సెల్‌ఫోన్ల ద్వారా వీడియోలు తీస్తూ ఎడాపెడా విచక్షణ లేకుండా యూట్యూబ్ చానళ్లలో పెడుతున్న వార్తలపై ఎన్నికల అధికారులు కఠినంగా వ్యవహరించనున్నారు. సోషల్ మీడియాలో వస్తున్న పోస్టులపై నిఘా పెట్టేందుకు ఎన్నికల అధికారులు ప్రతీ జిల్లాలో ప్రత్యేక మీడియా మానిటరింగ్ కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ కమిటీలో కలెక్టర్, అడిషనల్ కలెక్టర్, పోలీసు అధికారుల పర్యవేక్షణలో, సోషల్ మీడియా నిపుణుడు, సీనియర్ జర్నలిస్ట్, సీనియర్ సిటిజన్, డీపీఆర్వో సభ్యులుగా ఉండనున్నారని అధికారులు వివరించారు. వీరు ప్రతీరోజూ దినపత్రికల్లో వచ్చే వార్తలను, రాజకీయ నాయకుల వ్యాఖ్యలను పరిశీలిస్తారు. ఈ కమిటీ చేసిన సూచనల మేరకు వివాదాస్పద పోస్టులు, వార్తలు పెట్టిన వారికి ఐటీ సెల్, సైబర్ క్రైం అధికారులు నోటీసులు జారీ చేసి విచారణ నిర్వహించి క్రిమినల్ చర్యలు తీసుకోనున్నారు.

గ్రూప్ అడ్మిన్‌లపైనా కేసులు..

ఎన్నికల కోడ్ అమలులో ఉన్న ప్రస్తుత తరుణంలో వాట్సప్ గ్రూపుల్లో సభ్యులెవరైనా రెచ్చగొట్టే కామెంట్లు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే నాయకుల ప్రసంగాలు వైరల్ చేసినా వారితో పాటు ఆ గ్రూప్ అడ్మిన్‌లపైన కూడా క్రిమినల్ కేసులు పెట్టి అరెస్టు చేయనున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. గ్రూపుల్లో పెడుతున్న వ్యాఖ్యలు, కామెంట్లు సామరస్యపూర్వకంగా ఉండేలా ఆయా గ్రూపుల అడ్మిన్‌లే బాధ్యత తీసుకోవాలన్నారు.

ఎన్నికల ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలి



డిగ్రీ కళాశాలను పరిశీలిస్తున్న కలెక్టర్

బాన్సువాడ రూరల్: అసెంబ్లీ ఎన్నికల ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని నిజామాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. బాన్సువాడలోని శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీకళాశాల, నూతనంగా నిర్మించిన ఆర్డీవో కార్యాలయాలను అదనపు కలెక్టర్ యాదిరెడ్డితో కలిసి బుధవారం సందర్శించారు. నియోజక వర్గంలోని 9మండలాల్లో బీర్కూర్, నస్రుల్లాబాద్, బాన్సువాడ మినహా 6మండలాలు పాత నిజామాబాద్ జిల్లాలోనే ఉన్నందున జిల్లా ఎన్నికల అధికారి హోదాలో కళాశాలలో ఏర్పాటు చేసే ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్‌రూంను పరిశీలించారు. అనంతరం అధికారులకు పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట ఆర్డీవోలు భుజంగరావు, రాజాగౌడ్, తహసీల్దార్ వరప్రసాద్, సర్వేయర్ అనిల్, గిర్దావర్ అశోక్, సిబ్బంది ఉన్నారు.

ప్రాథమిక దశలోనే లెప్రసీని గుర్తించాలి



మాట్లాడుతున్న రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ జాన్‌బాబు

మాక్లూర్: ప్రాథమిక దశలోనే కుష్టు వ్యాధిని గుర్తించి వ్యాధిగ్రస్తులకు తగు మందులు అందిస్తే ఫలితం ఉంటుందని రాష్ట్ర లెప్రసీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జాన్‌బాబు అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వైద్య సిబ్బంది గ్రామాల్లోని వ్యాధిగ్రహస్తులపై దృష్టి సారించాలన్నారు. అనంతరం వ్యాధి గ్రహస్తుల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో డీపీఎం శ్రీచందస్, వైద్యులు వరలక్ష్మి, ఆనంద్‌కుమార్, సుధాకర్, దేవపాలం, ఆశవర్కర్లు, సిబ్బంది ఉన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించాలి



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని 270 పోలింగ్ కేంద్రాలను సెక్టోరల్ అధికారులు పరిశీలించి నివేదికలను అందించాలని రిటర్నింగ్ అధికారి మన్నె ప్రభాకర్ ఆదేశించారు. బుధవారం ఆర్డీవో కార్యాలయంలో సెక్టోరల్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. పోలింగ్ కేంద్రాలను సందర్శించి వాటిలో గల లోటు పాట్లను వివరించాలన్నారు. కేంద్రాల్లో ఏవైన సామగ్రి ఏర్పాటు చేయాల్సి వస్తే ఆ వివరాలను నివేదిక రూపంలో అందించాలన్నారు. ఏఆర్‌వో సురేష్ తదితరులున్నారు.

క్రైం కార్నర్

ఆభరణాల కోసమే హత్య

కేసును ఛేదించిన పోలీసులు

కామారెడ్డి క్రైం: మండలంలోని నర్సన్నపల్లిలో ఓ మహిళ గత నెల 15న హత్యకు గురైన కేసును రూరల్ పోలీసులు ఛేదించారు. విచారణలో మృతురాలి ఒంటిపై ఉన్న ఆభరణాల కోసమే హత్యకు పాల్పడినట్లు తేలింది. దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. దేవునిపల్లికి చెందిన శ్రీగాద అరుణ(35), మారాం విజయలు స్నేహితులు. విజయకు అప్పులు బాగా పెరిగిపోవడంతో అరుణపై ఉన్న బంగారాన్ని దొంగిలించాలని భర్త శంకర్, కొడుకు విష్ణువర్ధన్‌తో కలిసి పథకాన్ని రచించింది. గత నెల 4న అరుణను ఇంటికి పిలిచి బాగా మద్యం తాగించారు. స్పృహలో లేనప్పుడు శంకర్, విష్ణువర్ధన్ ఆటోలో ఎక్కించుకొని నర్సన్నపల్లిలో నిర్మించిన ఓ డబుల్ బెడ్ రూం ఇంట్లోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడి హత్య చేశారు. తర్వాత ఒంటిపై ఉన్న బంగారు కమ్మలను తీసుకెళ్లారు. వాటిని రూ.16 వేలకు గోల్డ్‌లోన్ తీసుకున్నట్లు నిందితులు వెల్లడించారు. మొబైల్ డాటా ఆధారంగా నిందితులను పట్టుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

జీవితంపై విరక్తితో ఒకరి ఆత్మహత్య



కిషన్‌గౌడ్ మృతదేహం

బీబీపేట: మండల కేంద్రానికి చెందిన బట్టుపల్లి కిషన్‌గౌడ్(52) జీవితంపై విరక్తితో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సాయిరెడ్డి బుధవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. కిషన్‌గౌడ్‌కు కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడని ఆసుపత్రుల్లో చూయించినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తితో ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు చెప్పారు. మృతుడి భార్య గంగామణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



పట్టుకున్న బియ్యంతో పోలీసులు

బీబీపేట: అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై సాయిరెడ్డి బుధవారం తెలిపారు. వాహనాల తనిఖీలో భాగంగా దుబ్బాక మండలం తిమ్మాపూర్‌కు చెందిన పాస్తం వెంకటేశ్, రమేశ్ తమ వాహనంలో 25 క్వింటాళ్ల బియ్యాన్ని బీబీపేట మీదుగా తరలిస్తుండగా గ్రామ శివారులో పట్టుకున్నట్లు పేర్కొన్నారు. అనంతరం సివిల్ సప్లై డీటీ కిష్టయ్య ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో దంపతుల మృతి



ప్రమాదంలో మృతి చెందిన దంపతులు (ఫైల్)

పిట్లం: సంగారెడ్డి జిల్లా అల్లాదుర్గ్ గేట్ సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పిట్లం మండలంలోని బొల్లక్‌పల్లికి చెందిన దంపతులు మృతి చెందారు. వివరాలిలా ఉన్నాయి. బొల్లక్‌పల్లికి చెందిన నారాయణ(65) భార్య దేవమణి (58)తో కలిసి కారులో హైదరాబాద్‌లో ఉన్న కుమారుడిని కలిసి దుస్తులు కొనుగోలు చేసి స్వగ్రామానికి వస్తుండగా అల్లాదుర్గం గేట్ సమీపంలో కారు బోల్తాపడింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ వీరిని స్థానికులు అంబులెన్స్‌లో జోగిపేట్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబీకులు బుధవారం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

పుప్పాలపల్లి హత్యకేసులో ఇద్దరి అరెస్టు



మాట్లాడుతున్న ఏసీపీ కిరణ్‌కుమార్

ఖలీల్‌వాడి: జక్రాన్‌పల్లి మండలం పుప్పాలపల్లి శివారులో జరిగిన హత్య కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ కిరణ్‌కుమార్ తెలిపారు. ఏసీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డిచ్‌పల్లి సీఐ కృష్ణ, జక్రాన్‌పల్లి ఎస్సై తిరుపతి మండలంలోని గన్యాతండా వద్ద అదే గ్రామానికి చెందిన కుందాపురం గొల్ల నర్సయ్య, నీలపు అలియాస్ నాయకపు రమేశ్‌ను పట్టుకొని విచారించగా గ్రామ చెరువు వద్ద మద్యం తాగినట్లు తెలిపారు. అనంతరం మహేశ్‌కి, గొల్ల నర్సయ్య మధ్య గొడవ జరిగింది. ఈ గొడవలో మహేశ్‌ను ఇద్దరు కలిసి కర్రతో తీవ్రంగా కొట్టి చంపేశారు. అనంతరం మృతదేహాన్ని, బైకును, సెల్‌ఫోన్‌ను చెరువులో పడేశారు. నిందితులను గన్యాతండాలో పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు.

ప్రమాదంలో తహసీల్దార్‌కు గాయాలు

మోర్తాడ్: మండల కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏర్గట్ల తహసీల్దార్ మహ్మద్ యూసుఫ్‌కు బుధవారం గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. ఎన్నికల సమావేశ నిమిత్తం తహసీల్దార్ భీమ్‌గల్‌కు సహచర ఉద్యోగితో కలిసి బైక్‌పై వెళ్తుండగా మోర్తాడ్ వద్ద ఎదురుగా వస్తున్న మరో బైక్ వీరిని ఢీకొన్నది. ఈ ఘటనలో తహసీల్దార్‌కు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

పోస్టాఫీస్‌లో చోరీకి యత్నం

ఎల్లారెడ్డి: పట్టణంలోని పోస్టాఫీస్‌లో మంగళవారం రాత్రి ఓ దొంగ చోరీ యత్నానికి పాల్పడినట్లు స్థానికులు బుధవారం తెలిపారు. మండలంలోని భిక్కనూర్ గ్రామానికి చెందిన మహేశ్ అనే నిందితుడు అర్ధరాత్రి పోస్టాఫీస్ తాళం పగల గొట్టేందుకు యత్నిస్తుండగా రోడ్డు గుండా వెళ్తున్న యువకులు గమనించి పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.

భర్త వివాహేతర సంబంధం..

- హోటల్‌లో పట్టుకున్న భార్య
- కేసు నమోదు చేసిన పోలీసులు

ఖలీల్‌వాడి: నగరంలోని ఓ ఇంటర్నేషనల్ హోటల్‌లో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న భర్తను ఓ భార్య రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని పోలీసులకు అప్పగించింది. నాలుగో టౌన్ ఎస్సై సంజీవ్ తెలిపిన వివరాల ప్రకారం.. గౌతంనగర్‌కు చెందిన రవి నగరంలోని పలు హోటళ్లకు కూరగాయలను సరఫరా చేస్తాడు. ఈ క్రమంలో నగరానికి చెందిన స్వప్నతో పరిచయం ఏర్పడింది. వీరు ఈ నెల 16 నుంచి హోటల్‌లోనే ఉంటున్నారు. రవి మూడు రోజుల నుంచి ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు గమనించి హోటల్‌లో ఉన్నట్లు తెలుసుకొని పోలీసులకు సమాచారం అందించారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

తనిఖీల్లో నగదు పట్టివేత



జిల్లా కేంద్రంలో పోలీసులు పట్టుకున్న నగదు

ఖలీల్‌వాడి/ నాగిరెడ్డిపేట/ మద్నూర్/ ఎల్లారెడ్డి: నగరంలోని రైల్వేస్టేషన్ ప్రాంతంలో నిర్వహించిన వాహనాల తనిఖీలో రూ. 8 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. మాక్లూర్ తండాకు చెందిన బాణావత్ మోతీలాల్ వద్ద ఈ నగదు లభించగా సరైన ఆధారాలు చూయించకపోవడంతో సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌లో ఒకరి నుంచి రూ.లక్షా50వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రాజు తెలిపారు. మద్నూర్ మండలంలోని సలాబత్‌పూర్ వద్ద కారులో వెళ్తున్న ఒకరి నుంచి రూ. రెండు లక్షల నగదును పట్టుకున్నట్లు తహసీల్దార్ మహమ్మద్ ముజీబ్, ఎస్సై కృష్ణారెడ్డి తెలిపారు. సరైన ఆధారాలు చూయించక పోవడంతో సీజ్ చేసినట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ మహేశ్ పేర్కొన్నారు. ఎల్లారెడ్డిలో వాహనాలను తనిఖీ చేస్తుండగా ఒకరి నుంచి రూ. 15 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై గణేశ్ తెలిపారు.

మద్యం పట్టివేత



బీబీపేట: మండలంలోని తుజాల్‌పూర్‌లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సాయిరెడ్డి బుధవారం తెలిపారు. సుమారు రూ. 4338 మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

వాహనాలను తనిఖీ చేయాలి

రుద్రూర్/ కమ్మర్‌పల్లి: కోటగిరి పీఎస్ పరిధిలోని పోతంగల్ శివారులో ఏర్పాటు చేసిన అంతర్రాష్ట చెక్‌పోస్టును బోధన్ ఏసీపీ కిరణ్‌కుమార్ తనిఖీ చేశారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం పోతంగల్‌లోని హైస్కూల్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన వెంట కోటగిరి ఎస్సై సందీప్, సిబ్బంది ఉన్నారు. కమ్మర్‌పల్లిలోని పోలీస్ చెక్‌పోస్టును ఆర్మూర్ ఏసీపీ జగదీశ్‌చందర్ సందర్శించారు. పోలీసులు చేపట్టిన వాహనాల తనిఖీని పరిశీలించారు. ఎస్సై, సిబ్బంది ఉన్నారు.

కొడుకును హత్య చేసిన కేసులో తండ్రి రిమాండ్

నవీపేట: మోకన్‌పల్లి గ్రామంలో కొడుకును చంపిన కేసులో తండ్రిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ బుధవారం తెలిపారు. పొలం అమ్మిన డబ్బుల విషయంలో తండ్రి కిషన్, కొడుకు శ్రీకాంత్ మధ్య ఈ నెల 14న గొడవ జరగగా కోపంతో తండ్రి కొడుకును హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో విచారణ చేపట్టి నిందితుడు కిషన్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

ప్రమాదవశాత్తు యువకుడి మృతి

నవీపేట: నందిగామ గ్రామానికి చెందిన కప్ప నాగేశ్(38) ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. కాలకృత్యాలకు వెళ్లిన నాగేశ్‌కు ట్రాన్స్‌ఫార్మర్ తీగలు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



సిరికొండ: మండల కేంద్రంతో పాటు న్యావనంది, పాకాల గ్రామాల్లో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఏసీపీ కిరణ్‌కుమార్ బుధవారం పరిశీలించారు. ఆ కేంద్రాల వద్ద ఎన్నికల సమయంలో ఎలాంటి ఘర్షణలు చోటు చేసుకోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ధర్పల్లి సీఐ సైదాకు సూచించారు. ఆయన వెంట ఎస్సై, సిబ్బంది ఉన్నారు.

దుబ్బాకలో..



ధర్పల్లి: ఎన్నికల నేపథ్యంలో మండలంలోని పలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను నిజామాబాద్ ఏసీపీ కిరణ్ కుమార్ బుధవారం పరిశీలించారు. దుబ్బాక, రేకులపల్లి, డీబీ తండా, హొన్నాజీపేట్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి, బూత్ స్థాయి అధికారులతో మాట్లాడారు. ఏర్పాట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఏసీపీ వెంట సీఐ సైదా, ఎస్సై వంశీకృష్ణారెడ్డి ఉన్నారు.

జిల్లా కేంద్రంలో సైబర్ మోసం

ఖలీల్‌వాడి: నగరంలోని నాలుగో టౌన్ పీఎస్ పరిధిలో ఓ మహిళను సైబర్‌నేరగాళ్లు మోసం చేసినట్లు ఎస్సై సంజీవ్ బుధవారం తెలిపారు. సదరు మహిళ తన ఫోన్‌లో ఇన్‌స్టాగాంలో వచ్చిన పార్ట్‌టైం జాబ్ లింక్‌పై క్లిక్ చేయగా వారు ఓ లింక్‌ను పంపించారు. టాస్కులు పూర్తి చేస్తే డబ్బులు అధికంగా వస్తాయంటు మొదటగా ఆమె అకౌంట్‌కు రూ. వెయ్యి పంపించారు. ఇది నమ్మిన మహిళ వారు చెప్పిన విధంగా విడుతల వారీగా వారి అకౌంట్లకు రూ. లక్షా25వేల నగదును పంపింది. దీంతో మోసాన్ని గ్రహించిన సదరు మహిళ 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.